సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 15 । జూన్ । 2025



రూ.లక్ష విరాళం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన పోలిశెట్టి వెంకన్నబాబు, సునీత దంపతులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




నాన్నా... నీ మనసే వెన్న

ప్రతి కుటుంబానికి ఆ వారధి, సారథి నాన్నే. ప్రతి అడుగులోనూ నీడలా ఉండే దైవం నాన్న. అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- IIలో▸

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 250, పశ్చిమ డెల్టాకు 3 వేలు కలిపి 5,550 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేశారు. సముద్రంలోకి 15,867 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

యోగాకు 7.66 లక్షల మంది నమోదు



సుబ్రహ్మణ్య మైదానంలో యోగా సాధన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా 4,889 ప్రాంతాల్లో యోగా సాధనకు 7.66 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా శనివారం యోగా ట్రయల్ రన్ నిర్వహించారు. నగరంలో 45 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు తెలిపారు. రాజమహేంద్రవం ఆర్ట్స్ కళాశాల వద్ద పర్యాటక, సాంస్కృతిక శాఖ, సరస్వతీ ఘాట్ వద్ద ఉద్యానవన శాఖ, పుష్కర ఘాట్ వద్ద మత్స్య శాఖ, సుబ్రహ్మణ్య మైదానంలో పోలీస్, సైనిక్ సంక్షేమ శాఖ, ఏకేసీ కాలేజీ రోడ్డులో వైద్య, ఆరోగ్య శాఖ, లాలాచెరువు బీటీ రోడ్డు సమీపాన సూర్య నమస్కారాల విగ్రహాల వద్ద, క్వారీ మార్కెట్, శివాలయం ఎదురుగా జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీనివాసా... శ్రీపురుషోత్తమా...

- వాడపల్లికి పోటెత్తిన భక్తజన సంద్రం
- ఒక్కరోజే రూ.60.16 లక్షల ఆదాయం

కొత్తపేట: శ్రీనివాసా.. శ్రీపురుషోత్తమా.. శ్రీవేంకటేశా.. గోవిందా అంటూ వాడపల్లి క్షేత్రంలో భక్తులు తన్మయత్వం చెందారు. స్వామివారిని చూసిన భక్తజనం ఆనందంతో ఉప్పొంగింది.. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం అశేష భక్తజనంతో కిక్కిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచీ భక్తులు వాడపల్లి బాట పట్టారు. దేవదాయ– ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమం నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన అనేక మంది స్వామివారిని దర్శించుకునేందుకు కాలినడకన తరలివచ్చారు. వేలాది మంది భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో వేంచేసిన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. మాఢ వీధులు, ఆలయ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదానం విరాళాలు, లడ్డూ విక్రయం తదితర రూపాల్లో ఈ ఒక్కరోజు సాయంత్రం 4.30 గంటల వరకూ దేవస్థానానికి రూ.60.16 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ చక్రధరరావు తెలిపారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా రాత్రి వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

తల్లికి వంచన

- పథకానికి ని'బంధనాలు'
- ఆదాయం, విద్యుత్ వినియోగం పేరిట అనర్హత వేటు
- జిల్లాలో 64,447 వేల మంది పరిస్థితి అగమ్యగోచరం





తల్లికి వందనం డబ్బులు రాని అంబేడ్కర్ కుటుంబ సభ్యులు

332 యూనిట్లు వాడినట్లు చూపుతున్న వైనం



తాజాగా 171 యూనిట్లకు వారికి వచ్చిన రూ.-0.14 విద్యుత్ బిల్లు

సాక్షి, రాజమహేంద్రవరం: తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న అనేక కుటుంబాలకు ద్రోహం చేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ పథకం కింద ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికీ ఎటువంటి నిబంధనలూ లేకుండా రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు చెప్పారు. 'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు' అంటూ గొప్పగా ప్రచారం చేశారు. తీరా అమలు చేయాల్సి వచ్చేసరికి కూటమి సర్కారు అనేక నిబంధనలతో ఆంక్షలు పెట్టింది. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,88,226 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,23,779 మందిని అర్హులుగా గుర్తించి వారి తల్లుల ఖాతాల్లో రూ.240 కోట్లు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వారి లెక్కల ప్రకారమే 64,447 మందికి మొండిచేయి చూపారు. ఇదిలా ఉండగా జిల్లాలో సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులున్నట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే ఎంత మంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారో అర్థం చేసుకోవచ్చు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా 1.62 లక్షల మంది విద్యార్థులకు ఒక్క అమ్మ ఒడి పథకం ద్వారానే రూ.243 కోట్లు జమ చేసేవారు. ఇలా నాలుగేళ్ల పాటు నిరంతరాయంగా అందించారు. ఇది కాకుండా ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు జగనన్న విద్యా, వసతి దీవెనల పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేశారు.

ఇవీ నిబంధనలు

- ఒకే ఇంట్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందితే ఆ ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వరు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉపకార వేతనాలు పొందే వారికి ఈ పథకం వర్తించదు.
- బియ్యం కార్డు లేకపోతే పథకం రాదు.
- కుటుంబం నెలవారీ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం వర్తించదు.
- మాగాణి మూడెకరాలు, మెట్ట భూమి 10 ఎకరాలు మించకూడదు.
- పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా పథకం వర్తించదు.
- ప్రతి కుటుంబానికీ ఏడాది విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని నెలకు 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం వర్తింపజేయరు.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారికి పథకం వర్తించదు. ఈ ఆంక్షలతో జిల్లాలో వేలాది మంది తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు.

అర్హత ఉన్నా వేటు

నిడదవోలు మండలానికి చెందిన వడల రత్నకుమారి, అంబేడ్కర్ దంపతుల పిల్లలు రిపిత (8వ తరగతి), వెంకట్ రిషి (6వ తరగతి) ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ కుటుంబం ఎస్సీ కేటగిరీ కింద విద్యుత్ వినియోగిస్తోంది. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీలకు ఉచిత విద్యుత్ నాలుగేళ్లుగా అమలవుతోంది. దీంతో, వీరు 300 యూనిట్ల విద్యుత్ బిల్లు వినియో గం ఆంక్షల పరిధిలోకి రారు. అయినప్పటికీ ఈ కుటుంబం 300 యూనిట్ల విద్యుత్ వాడినట్లు చూపించి, తల్లికి వందనం పథకానికి అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో ఇద్దరు పిల్లలకూ నయాపైసా కూడా జమ కాలేదు. దీని పై ఆ కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఈ కుటుంబమే కాదు.. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

వీరు కూడా దూరం

సీబీఎస్ఈతో పాటు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు తల్లికి వందనం జాబితాలో కనుమరుగయ్యాయి. గత విద్యా సంవత్సరంలో టెన్త్, సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ డబ్బులు ఇవ్వలేదు. టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుతం ఇంటర్, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరితేనే వారికి లబ్ధి కలుగుతుంది. సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను అనర్హుల్ని చేశారు.

నాడు తప్పు.. నేడు ఒప్పా?

ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు మాత్రమే జమ చేసింది. మిగిలిన రూ.2 వేలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మినహాయించినట్లు తెలిపింది. ఈ నిధులు జిల్లా కలెక్టర్ ఆధీనంలో ఉంచే విధంగా జీఓలో పేర్కొంది. ఇదే పని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తే నాడు కూటమి నేతలు బురద జల్లారు. ఇలా చేయడం నాడు తప్పని చెప్పినప్పుడు ఇప్పుడు ఎలా ఒప్పవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమే..

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత చెల్లుబోయిన వేణు
- 'జగన్ అంటే నమ్మకం.. బాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమేనని, ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని, రెడ్‌బుక్ రాజ్యాంగాన్నే అమలు చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అరాచకాలు, విధ్వంసంపై వాస్తవాలు, ఆధారాలతో వైఎస్సార్ సీపీ ఈ పుస్తకాన్ని తీసుకు వచ్చిందని చెప్పారు. ఐదు కోట్ల మంది ప్రజలకు చంద్రబాబు ఎలా వెన్నుపోటు పొడిచారో ఆధారాలతో ఇందులో వివరించారన్నారు. 2014–19 పాలనలో చంద్రబాబు రైతులను, మహిళలను మోసం చేయగా.. 2019–24 మధ్య గత ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తును అందించేలా పాలన సాగించారని చెప్పారు. చంద్రబాబు దుష్ట పాలనను గ్రామ స్థాయి వరకూ తీసుకువెళ్లి, ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదో గట్టిగా ప్రశ్నించాలని, ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని వేణు కోరారు. పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ, హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయకపోయినా.. ఏడాది పాలనను సుపరిపాలనకు తొలి అడుగు అంటూ కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలు అయిపోయాయని, ఇక ఎవరైనా అడిగితే నాలుకలు కట్ చేస్తామని ముఖ్యమంత్రి హోదాలో ఉండి చంద్రబాబు మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. హామీలు నెరవేర్చకుండా అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి ఎంతకు అమ్ముతున్నారో అందరికీ తెలిసిందేనన్నారు. మద్యం ఏరులై పారుతోందని, 60 వేల బెల్ట్ షాపులు నడుస్తున్నాయని దుయ్యబట్టారు. 89 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇస్తున్నారని ప్రశ్నించారు. 50 ఏళ్లు దాటిన బీసీ మహిళలకు పెన్షన్ ఇస్తామన్నారని, ఆవిధంగా ఎక్కడ ఇచ్చారని నిలదీశారు. దాదాపు 60 లక్షల మంది బీసీ, ఎస్సీ మహిళలున్నారని చెప్పారు. అలాగే, పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు రూ.18,500 ఇస్తామని చెప్పి ఎక్కడిచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు కుదేలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రంగమూ బాగోలేదని, రాష్ట్రం అతలాకుతలమైపోయిందని విమర్శించారు. నాడు వైఎస్ జగన్ కృష్ణా నదికి కరకట్ట కట్టకపోయి ఉంటే వరదలకు విజయవాడ, రాజధాని ఎలా ఉండేవో ఊహించుకోవాలని భరత్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఈవిధంగా ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రీ అమలు చేసిన దాఖలాల్లేవన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకటరావు, పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర తెలికుల, గాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణు, జక్కంపూడి రాజా, మార్గాని భరత్‌రామ్, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, తిప్పల గురుమూర్తిరెడ్డి, డాక్టర్ గూడూరి తదితరులు

నీట్‌గా మెరిశారు

రాజమహేంద్రవరం రూరల్: వైద్య విద్యా కోర్సులలో ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష నీట్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఎంబీబీఎస్ చదివి అనంతరం న్యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, స్కల్ సర్జన్ తదితర స్పెషలైజేషన్ అంశాల్లో పీజీ చేసి, వైద్యసేవలందిస్తామని ఈ సందర్భంగా పలువురు విజేతలు చెప్పారు.



పేరు: డి.కార్తీక్‌రామ్ కిరీటి, రాజమహేంద్రవరం
ర్యాంకు: 19 (ఓపెన్ కేటగిరీ), 18 (ఈడబ్ల్యూఎస్)
తండ్రి: డాక్టర్ డీఎస్ అరుణ్ కుమార్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్
తల్లి: లత, గృహిణి
లక్ష్యం: కార్డియాలజిస్ట్, స్కల్ సర్జన్



పేరు: కె.ఈప్సిత్ కశ్యప్, రాజమహేంద్రవరం
ర్యాంకు: 198 (ఓపెన్ కేటగిరీ),12 (ఈడబ్ల్యూఎస్)
తండ్రి: సారథి కశ్యప్ (లేటు)
తల్లి: గాయత్రి, టీచర్
లక్ష్యం: ఆర్థోపెడీషియన్, న్యూరోసర్జన్



పేరు: కేవీవీ నాగసాయి పవన్, రాజమహేంద్రవరం
ర్యాంకు: 587 (ఓపెన్ కేటగిరీ), 154 (ఓబీసీ)
తండ్రి: రామకృష్ణ, బిల్డర్
తల్లి: లక్ష్మీరూప, గృహిణి
లక్ష్యం: జనరల్ సర్జన్, రేడియాలజిస్ట్



పేరు: టి.సాహితి, రాజమహేంద్రవరం
ర్యాంకు: 1209 (ఓపెన్ కేటగిరీ), 32 (ఎస్సీ)
తండ్రి: టీవీఆర్ రాజు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
తల్లి: నాగమణి, స్కూల్ అసిస్టెంట్
లక్ష్యం: కార్డియాలజిస్ట్



పేరు: ఎం.సూర్య సంతోష్‌రెడ్డి, పందలపాక
ర్యాంకు: 1518 (ఓపెన్ కేటగిరీ), 880 (ఈడబ్ల్యూఎస్)
తండ్రి: డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, వైద్యుడు
తల్లి: సంధ్యాదేవి, కెమిస్ట్
లక్ష్యం: జనరల్ సర్జన్, గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు

పాలిటెక్నిక్ ప్రవేశాలకు వేళాయె..

- 21 నుంచి కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల పరిశీలన
- 25 నుంచి ఆప్షన్ల ఎంపిక
- జూలై 3న సీట్ల కేటాయింపు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకూ విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. దీని కోసం బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. షెడ్యూల్‌లో ప్రకటించిన ప్రకారం ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులు వారి ర్యాంకుల ప్రకారం హాజరు కావాలి.

విద్యార్థులకు సూచనలు

- ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. దీని రశీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి హాల్ టికెట్, ఒరిజినల్ మార్కుల జాబితా లేదా ఇంటర్‌నెట్ కాపీ తీసుకుని రావాలి.
- నాలుగు నుంచి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్ లేదా 2025–26లో మీసేవ, గ్రామ సచివాలయం నుంచి తీసుకున్న రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఉండాలి.
- 2022 జనవరి 1 తరువాత తీసుకున్న ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాలి.
- ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సీఏపీ, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25 నుంచి 28వ తేదీలోగా హాజరు కావాలి.
- ఈ నెల 25 నుంచి వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. ఈ నెల 25, 26 తేదీల్లో 1 నుంచి 50,000 వరకూ, 27, 28 తేదీల్లో 50,001 నుంచి 90,000 వరకూ, 29, 30 తేదీల్లో 90,001 నుంచి చివరి ర్యాంకు వరకూ విద్యార్థులు ఆప్షన్లు ఎంచుకోవచ్చు.
- ఆప్షన్ల మార్పునకు జూలై 1న అవకాశం ఇస్తారు.
- జూలై 3న కళాశాలల్లో సీట్ల కేటాయింపు ఉంటుంది.

సర్టిఫికెట్ల పరిశీలనకు ర్యాంకుల వారీగా షెడ్యూల్

తేదీ	ర్యాంకులు
జూన్ 21	1–15000
22	15,001–32,000
23	32,001–50,000
24	50,001–68,000
25	68,001–86,000
26	86,001–1,04,000
27	1,04,001–1,20,000
28	1,20,001–చివరి ర్యాంకు వరకూ

- వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీపీఓఎల్ఐసీఈటీ.ఎన్ఐసీ.ఇన్.వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

విజయవాడలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఇలా..

తేదీ	కేటగిరీ	ర్యాంకులు
25	ఎన్‌సీసీ	1–40,000
	పీడబ్ల్యూడీ	1 నుంచి చివరి ర్యాంకు వరకూ
26	స్పోర్ట్స్ అండ్ గేమ్స్	1 నుంచి 60,000 వరకూ
	ఎన్‌సీసీ	40,001 నుంచి 80,000
27	స్పోర్ట్స్ అండ్ గేమ్స్	60,001 నుంచి చివరి ర్యాంకు వరకూ
	ఎన్‌సీసీ	80,001 నుంచి చివరి ర్యాంకు వరకూ
28	సీఏపీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంగ్లో ఇండియన్	1 నుంచి చివరి ర్యాంకు వరకూ

నాన్నా... నీ మనసే వెన్న



క్లుప్తంగా

22న ద్విశత కవి సమ్మేళనం


కత్తిమండ ప్రతాప్

సఖినేటిపల్లి: కాకినాడలో ఈ నెల 22న శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో గోదావరి కవితా పండగ కాన్సెప్ట్‌లో జాతీయ స్థాయి ద్విశత కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శనివారం సఖినేటిపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాకినాడ పీఆర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ ద్విశత కవి సమ్మేళనంలో ఢిల్లీ, ఒడిశా, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి రెండు వందల మందికి పైగా కవులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. అలాగే ఇటీవల పర్యావరణంపై ప్లాస్టిక్ భూతం అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో విజేతలకు బహుమతులు గోదావరి కవితా పండగలో అందజేస్తామని కూడా ఆయన తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాడివారిమెరకకు చెందిన తాడి అశోక్‌కుమార్ (35) శుక్రవారం కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ శనివారం తెలిపారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పెయింటర్‌గా పని చేసే అశోక్‌కుమార్ పిల్లలకు అనారోగ్యంగా ఉండడంతో బొండం కోసం చెట్టెక్కి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అశోక్‌కుమార్ మృతితో అతని భార్య నాగమణి, 15 ఏళ్ల కుమార్తె స్వప్న, 13 ఏళ్ల కుమారుడు సంతోష్ కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,000
గటగట (వెయ్యి)	25,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

- నడిపించే దైవం ఆయనే
- కుటుంబానికి వెలుగునిచ్చే సారథి
- నేడు ఫాదర్స్ డే

కపిలేశ్వరపురం/ బిక్కవోలు: వారధి లేకుండా నదిని దాటలేం... సారథి లేకుండా రథం నడవలేం.. ప్రతి కుటుంబానికి ఆ వారధి, సారథి నాన్నే. పిల్లలు తప్పటడుగులు వేసే వయసు నుంచి వారి వేలు పట్టుకుని నడక నేర్పి లోకాన్ని చూపే ప్రతి అడుగులోనూ నీడలా ఉండే దైవం నాన్న. అలాంటి నాన్న కన్నీటి కష్టాన్ని కనురెప్పల మాటున దాచుకుంటాడు. తాను చిరిగిన చొక్కా అయినా వేసుకోవడానికి ఇష్టం పడతాడు కానీ తన పిల్లలకు మంచి దుస్తులు కొని ఇవ్వాలని ఆరాటపడుతుంటాడు. గుండెల్లో పెట్టుకుని పెంచి పెద్ద చేసి తన పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చే త్యాగశీలుడు. మాట కాస్తా కటువుగా ఉన్నా మనసు వెన్నే.. శనివారం అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం సందర్భంగా, చిన్నారులు, నేటి యువతకు తమ తండ్రి పట్ల ఉండే అనుబంధం గురించి సాక్షి ప్రత్యేక కథనం ఇది.

ఫాదర్స్ డే రోజునే ఉద్యోగంలోకి..

కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన పాలచర్ల అమ్మిరాజు స్థానిక వ్యవసాయ సహకార సంఘంలో చిరుద్యోగి. తన భార్య సునీతతో కలసి తన ఇద్దరు పిల్లలను ప్రణాళికాబద్ధంగా చదివించారు. రోజూ న్యూస్ పేపర్‌లో ప్రచురితమైన విజయం సాధించిన వారి కథనాలను పిల్లలతో చదివించేవారు. అంచెలంచెలుగా పిల్లలు ఎదుగుతూ పెద్ద ప్యాకేజీలతో గూగుల్‌లో ఉద్యోగులయ్యారు. పెద్ద కుమారుడు శ్రీవినోద్ ఎంసెట్‌లో 289వ ర్యాంకు, గేట్‌లో 240వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. ఐఐటీ చెన్నైలో ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి, అక్కడే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సామ్‌సంగ్ రీసెర్చ్ బెంగళూరుకు ఎంపికై రెండేళ్లపాటు రూ.22 లక్షల ఏడాది ప్యాకేజీలో ఉద్యోగం చేశాడు. 2023 సెప్టెంబర్‌లో గూగుల్ సంస్థలో రూ.50 లక్షల ప్యాకేజీకి ఎంపికై ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్రీసత్యనవీన్ జేఈఈ మెయిన్స్‌లో 1924వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. మ్యాథ్స్, ఫిజిక్స్‌లలో 100కి 100 మార్కులు రావడం అతని ప్రత్యేకత. మెయిన్స్ ఆధారంగా ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. అక్కడే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో గూగుల్‌కి ఎంపికై రూ. 44 లక్షల ఏడాది ప్యాకేజీకి ఎంపికయ్యాడు. తండ్రి ప్రోత్సాహంతో ఉన్నత స్థితికి చేరుకున్న శ్రీసత్యనవీన్ ఫాదర్స్ డే రోజునే గూగుల్‌లో ఉద్యోగంలో చేరుతుండటం విశేషం. తాము ఇలా స్థిరపడడానికి తన తండ్రి బాటలు వేశారని ఆ కుమారులు అంటున్నారు.


గూగుల్‌లో ఉద్యోగాలు సాధించిన శ్రీవినోద్, శ్రీసత్యనవీన్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు అమ్మిరాజు, సునీత

ఆ ప్రోత్సాహం.. ఆమె ప్రగతికి దోహదం

కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన ఎస్‌బీఐ చీఫ్ అసోసియేట్ యానాల సాయికృష్ణ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అచ్చియ్యమ్మల ఏకైక కుమార్తె యానాల శుభశ్రీవల్లి ఆత్రేయి. చిరునవ్వుల ఈ చిన్నారికి చదువంటే ప్రాణం. ఆమె ఆసక్తిని గమనించిన నాన్న తగిన విధంగా ప్రోత్సహించారు. ఆత్రేయికి చిన్నతనంలో ఆశించిన మార్కులు వచ్చేవి కాదు. దీంతో నిరుత్సాహపడేది. తక్కువ మార్కులు వచ్చాయన్న విషయాన్ని నాన్న సాయికృష్ణ పెద్దగా పట్టించుకునేవారు కాదు. చదువును ప్రేమించే మనస్తత్వం తన చిన్నారికి ఉందా లేదా అన్నదే గమనించేవారు. నిరుత్సాహంతో ఉన్న ఆమెకు జీవితంలో ఒడిదొడుకులు ఎలా వస్తాయో, ఎలా ఎదుర్కోవాలో తెలియజెప్పేవారు. మార్కుల ఆధారంగా జీవితాన్ని తూకం వేసుకోవద్దని అనేవారు. లక్ష్యం కోసం చేసే ప్రయత్నం స్థాయిని మరింత పెంచుకోమని ప్రోత్సహించేవారు. మూడేళ్ల ఆయన మాటలు ఫలితంగా ప్రేరణ పొందిన ఆత్రేయి ఇక వెనక్కి చూసుకోవాల్సిన అవసరం లేని స్థాయిలో ముందుకు దూసుకుపోయింది. రోజూ చదువుకునే క్రమంలో శారీరక, మానసిక సమస్యలను అమ్మ అచ్చియ్యమ్మ తీర్చి లక్ష్యం వైపు అడుగులు వేసేందుకు తోడ్పాటునిచ్చారు. ఇటీవల విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో ఆత్రేయి 296వ ర్యాంక్‌ను సాధించింది. ఫిబ్రవరిలో విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.98 స్కోర్‌తో ప్రతిభ కనబర్చింది. ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో ఇంజినీరింగ్‌లో 91వ ర్యాంక్ సాధించింది. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కింది. అనంతరం సివిల్స్‌లో ఐఏఎస్ చదవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు ఆత్రేయి తెలిపింది.


అమ్మానాన్నతో యానాల శుభశ్రీవల్లీ ఆత్రేయి

మొదటి గురువులా..



ప్రతి ఒక్కరూ మంచి విలువలతో జీవించాలి. అలాంటి విలువలను మొదటి గురువులా చెప్పేది, నేర్పిందేది నాన్న మాత్రమే. మా నాన్న గొర్రిపోటి సత్యనారాయణ కష్టం గురించి తెలియకుండా పెంచారు. నేను నాన్న అయిన తరువాత మా నాన్న కష్టం నాకు తెలిసింది. మా అబ్బాయికి కూడా అదే విలువలు నేర్పిస్తున్నాను. తండ్రి ఒక్క రోజు ఉంటే సరిపోదు. ప్రతి రోజూ పిల్లల వెంట ఉండి సన్మార్గంలో నడిపించాలి.

–తండ్రి సత్యనారాయణతో
గొర్రిపోటి నాగేశ్వరరావు, పందలపాక

ఆయనే కొండంత ధైర్యం

ఏ సమస్య, కష్టం వచ్చినా నాన్న ఉన్నాడనే ధైర్యం ఉంటుంది. నన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. నేను, మా తమ్ముడు మణికంఠ కమల్ ఉన్నత స్థాయి చేరుకోవాలని మా నాన్న బండారు రాము కలలుకంటున్నారు. మాకు కొద్దిగా నలతగా ఉంటే తట్టుకోలేరు. ఆరోగ్యం బాగయ్యే వరకూ ఎంతో తపిస్తారు. తప్పకుండా నాన్న కోరిక నెరవేర్చేందుకు నా వంతు శ్రమిస్తా. ఆయనే మాకు ఆదర్శం.

–తండ్రి బండారు రాముతో
సంధ్య అఖిలదేవి, మణికంఠ కమల్, కొప్పవరం





మాకు మంచి స్నేహితుడు



నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నేనన్నా, మా తమ్ముడు శ్రీను అన్నా నాన్నకు ఎంతో ఇష్టం. నాకు ఏమి కావాలన్నా నాన్న కొనిస్తారు. మా నాన్న సప్పా సత్యనారాయణ మాకు మంచి స్నేహితుడు. మేము ఎప్పుడూ సరదాగా స్నేహితుడిలా ప్రతి విషయాన్ని చర్చించుకుంటాం. స్నేహితుడిలా ఉంటూ మా భవిష్యత్ సలహాలు అందించారు.

–తండ్రి సత్యనారాయణతో
సప్పా నాగేశ్వరరావు,
కొంకుదురు

ఎంతో ప్రేమగా చూస్తారు..

సాధారణంగా తల్లి దగ్గరకన్నా ఆడపిల్లలకు తండ్రి దగ్గరే చనువెక్కువగా ఉంటుందంటారు. నా విషయంలోనూ అది పూర్తిగా నిజమైంది. మా నాన్న గొలుగూరి నాగిరెడ్డి చిన్నప్పటి నుంచి నన్ను చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. నాకు పెళ్లయి కూతురు ఉన్నప్పటికీ ఏ విషయమైనా మా నాన్నతోనే పంచుకుంటాను.

–తండ్రి గొలుగూరి నాగిరెడ్డితో పడాల దేవి,
పొలమూరు



నీట్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్‌లో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో డి.కార్తీక్ రామ్‌కిరీటికి ఏపీ ఫస్ట్ ర్యాంకుతో పాటు ఆలిండియా 19వ ర్యాంకు సాధించాడన్నారు. వివిధ కేటగిరీల్లో కె.ఈప్సిత్ కశ్యప్ 12వ ర్యాంకు, డి.కార్తీక్‌రామ్ కిరిటీ 18వ ర్యాంకు, టి.సాహితి 32వ ర్యాంకు, కేవీవీ నాగసాయి పవన్ 154వ ర్యాంకు, ఎం.సూర్యసంతోష్‌రెడ్డి 880వ ర్యాంకు, ఎల్.అభిషేక్ 888 ర్యాంకు, టి.రామచంద్రన్ 1,145వ ర్యాంకు, ఎల్.వర్షిత్ 1,237వ ర్యాంకు, పి.ప్రశంస 1,851వ ర్యాంకు, కె.విన్షిత 1,909వ ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. వెయ్యిలోపు ఆరుగురు, ఐదు వేల లోపు 35 మంది, 10 వేల లోపు 71 మంది, 20 వేల లోపు 138 మంది, 30 వేల లోపు 189 మంది ర్యాంకులు సాధించారని, 250 మందికి పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తారని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

శ్రీషిర్డీసాయి విజయకేతనం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నీట్ ఫలితాల్లో శ్రీషిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ దీక్ష్యా మెడికల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.సంజన ఆల్ ఇండియా 227వ ర్యాంకు, కె.పావన్ తనయ్ 308వ ర్యాంకును కైవసం చేసుకున్నారన్నారు. 2 వేల లోపు ర్యాంకులు ఐదుగురు, ఐదు వేల లోపు 8 మంది, పది వేల లోపు 15 మంది ర్యాంకులు సాధించినట్లు శ్రీవిద్య వివరించారు. విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన మొత్తం విద్యార్థుల్లో 20 శాతం మంది ఎమ్‌బీబీఎస్ సీట్లు సాధించగలరన్నారు. ఏటా తమ విద్యార్థులు నీట్, జేఈఈ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, దీక్ష్యా అకాడమీ డీన్ పి.నరసింహారావు అభినందించారు.


బి.సంజన


కె.పావన్ తనయ్

నీట్‌లో సత్తా చాటిన ఆదిత్య

బాలాజీచెరువు (కాకినాడ): నీట్–2025 ఫలితాల్లో 625/720 మార్కులతో వి.సాయి భవ్య హర్షిణి ఆలిండియా 227వ ర్యాంకును సాధించారని ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఏకేఎస్‌దీపక్‌రెడ్డి తెలిపారు. ఎన్‌టీఏ ప్రకటించిన నీట్ ఫలితాల్లో దగ్గుమాటి శ్రవణ్ కార్తికేయ ఆలిండియా 109వ ర్యాంకు, వీరంరెడ్డి సాయిభవ్య హర్షిణి ఆలిండియా 227వ ర్యాంకు, దంగేటి శ్రీనివాస రిషిత్ ఆలిండియా 890వ ర్యాంకులను సాధించారని అన్నారు. ఆలిండియా నీట్ ఫలితాల్లో 550 మార్కులు పైన 12 మంది విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించడంతో ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో 'ఆదిత్య'ను అగ్రగామిగా నిలిచిందని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ దీపక్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అడ్మిషన్లు విశాఖపట్నం ఆదిత్య గంగరాజునగర్, మారికవలసలో ప్రారంభించారని తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల హాస్టల్ డైరెక్టర్ ఎ.లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ శృతి, డైరెక్టర్ సుగుణ, ప్రిన్సిపాల్స్ జె.మొయిన, పి.సత్యనారాయణ రెడ్డి, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ ఎస్‌వీ రాఘవరెడ్డి, ఎస్‌పీ గంగిరెడ్డి, ఐఐటీ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఫణీంద్ర, ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాల్లో ప్రిన్సిపాల్స్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఉత్తమ శిక్షణ అందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.


దగ్గుమాటి శ్రవణ్ కార్తికేయ


వీరంరెడ్డి సాయిభవ్య హర్షిణి


శ్రీనివాస రిషిత్

కళ్లు తెరవకుండానే.. కన్నుమూసిన పసికందు

- వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- ఇద్దరు నర్సుల సస్పెన్షన్

తాళ్లరేవు: కళ్లు కూడా తెరవకుండానే ఆ పసికందుకు నూరేళ్లు నిండిపోయాయి.. గర్భిణిని వైద్యులు, సిబ్బంది సక్రమంగా పట్టించుకోక పోవడంతో బిడ్డ పురిట్లోనే చనిపోయినట్లు బంధువులు ఆందోళనకు దిగారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చెక్కా మాధురికి పురిటి నొప్పులు రావడంతో భర్త రాము తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో చేర్చారు. తల్లీ, బిడ్డ క్షేమంగా వస్తారని ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు బిడ్డ మృతి చెందాడన్న వార్తను జీర్ణించుకోలేకపోయారు. శనివారం తెల్లవారు జామున 5.40 గంటలకు మాధురికి పురిటి నొప్పులు వచ్చినప్పటికీ డ్యూటీలో ఉన్న వైద్యురాలు డి.స్నేహలత గాని, నర్సులు ఇందిర, శైలజ గాని పట్టించుకోకపోవడంతో స్వీపర్ అనంత డెలివరీ చేసినట్లు చెబుతున్నారు. అయితే బిడ్డ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వైద్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అయితే అప్పటికే పసికందు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకుని, వైద్యురాలు స్నేహలత నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆమెను సస్పెండ్ చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వీరికి పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మద్దతు పలికారు.

ఆరు గంటలపాటు ఆందోళన

కాకినాడ – యానం రహదారిపై ఆందోళనకారులు బైఠాయించి ధర్నా చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, నైట్ డ్యూటీ డాక్టర్ స్నేహలతపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఆ రహదారిలో సుమారు 6 గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. జనం అధిక సంఖ్యలో రావడంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్నేహలతను సస్పెన్షన్ చేసేవరకూ ఆందోళన విరమించేది లేదని చెప్పడంతో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణకు సమాచారం ఇచ్చారు. పెదపూడి ఎస్సై తులసీరామ్, ఇంద్రపాలెం ఎస్సై వీరబాబుతో పాటు, ఏపీఎస్పీ బలగాలను రప్పించారు. ఇలా ఉండగా అధికార పార్టీ నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి బాబి, జక్కల ప్రసాద్ తదితరులు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పందించి కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ముగ్గురు వైద్యులు వినోద్‌కుమార్, సుజాత, సతీష్‌లతోకూడిన బృందంతో విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి డ్యూటీలో ఉన్న నర్సులు ఇందిర, శైలజలను సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆర్డీఓ మల్లిబాబు ప్రకటించారు. అయితే వైద్యురాలు స్నేహలతపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు పట్టుబట్టడంతో ఆమెపై చర్యలు తీసుకోవడం తమ పరిధిలో లేదని, జరిగిన ఘటనపై ఉన్నతస్థాయి విచారణ చేసినట్లు తెలిపారు.


పసికందు మృతితో బోరున విలపిస్తున్న తల్లి చెక్కా మాధురి


తాళ్లరేవు సామాజిక ఆసుపత్రి వద్ద రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు



సూపర్ 'సఫారీ'

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికా సుదీర్ఘ స్వప్నం నెరవేరింది...ఐసీసీ ట్రోఫీ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాడిన టీమ్ ఎట్టకేలకు ఆ లక్ష్యాన్ని చేరుకుంది...1998లో ఐసీసీ నాకౌట్ కప్ సాధించిన తర్వాత 7 వన్డే వరల్డ్ కప్‌లు, 9 టి20 వరల్డ్ కప్‌లు, 9 చాంపియన్స్ ట్రోఫీలు, 2 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లు జరగ్గా... ఒక్క సారి కూడా టైటిల్ అందుకునే అవకాశమే రాలేదు... అద్భుతంగా ఆడుతూ వచ్చి అసలు సమయంలో చేతులెత్తేసిన సందర్భాలు కొన్నయితే, అవసరమైన చోట అదృష్టం మొహం చాటేసిన సందర్భాలు మరికొన్ని... ఇప్పుడు ఆ 'చోకర్స్' ముద్రను వెనక్కి తోస్తూ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో సఫారీ టీమ్ సంబరాలు చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి బవుమా సేన సగర్వంగా సత్తా చాటింది. ఐసీసీ టోర్నీ ఫైనల్ అంటే చెలరేగిపోయే ఆసీస్ ఈ సారి మాత్రం బ్యాటింగ్ వైఫల్యంతో తలవంచి నిరాశగా వెనుదిరిగింది.

- 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సొంతం
- ఫైనల్లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై ఘన విజయం

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 83.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎయిడెన్ మార్క్‌రమ్ (207 బంతుల్లో 136; 14 ఫోర్లు) దాదాపు చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు. న్యూజిలాండ్ (2021), ఆస్ట్రేలియా (2023) తర్వాత డబ్ల్యూటీసీ గెలుచుకున్న మూడో టీమ్‌గా దక్షిణాఫ్రికా నిలిచింది. విజేత దక్షిణాఫ్రికాకు రూ. 30.76 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

27.4 ఓవర్లలో 69 పరుగులు...

ఆట ఆరంభంలోనే తెంబా బవుమా (134 బంతుల్లో 66; 5 ఫోర్లు)ను కమిన్స్ అవుట్ చేయగా, కొద్ది సేపటికే స్టబ్స్ (8)ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో దక్షిణాఫ్రికా మరో 41 పరుగులు చేయాల్సి ఉండటంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో వైపు మార్క్‌రమ్ మూడో రోజు తరహాలోనే పట్టుదలగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అతనికి బెడింగ్‌హామ్ (21 నాటౌట్) అండగా నిలిచాడు. ఎట్టకేలకు కొత్త బంతిని తీసుకున్న వెంటనే తొలి ఓవర్లోనే మార్క్‌రమ్‌ను హాజల్‌వుడ్ వెనక్కి పంపించినా...అప్పటికే ఆలస్యమైపోయింది. విజయానికి మరో 5 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా, స్టార్క్ వేసిన బంతిని వెరీన్ కవర్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో సఫారీ శిబిరంలో వేడుక మొదలైంది.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 138; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 207; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) హెడ్ (బి) హాజల్‌వుడ్ 136; రికెల్టన్ (సి) క్యారీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (సి) క్యారీ (బి) కమిన్స్ 66; స్టబ్స్ (బి) స్టార్క్ 8; బెడింగ్‌హామ్ (నాటౌట్) 21; వెరీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (83.4 ఓవర్లలో 5 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-9, 2-70, 3-217, 4-241, 5-276. **బౌలింగ్:** స్టార్క్ 14.4-1-66-3, హాజల్‌వుడ్ 19-2-58-1, కమిన్స్ 17-0-59-1, లయన్ 26-4-66-0, వెబ్‌స్టర్ 5-0-13-0, హెడ్ 2-0-8-0.



కుమారుడితో బవుమా సంబరం

చోకర్స్ కాదు... విన్నర్స్

దాదాపు ఏడాది క్రితం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో టి20 వరల్డ్ కప్ ఫైనల్లో తలపడింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో చేతిలో 6 వికెట్లతో 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనిపించగా...చివరకు 7 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డగౌట్‌లో కూర్చుకున్న కెప్టెన్ మార్క్‌రమ్ కన్నీళ్లపర్యంతమైన దృశ్యం దక్షిణాఫ్రికా అభిమానులకు కలచివేసింది. ఇప్పుడు సంవత్సరం తిరగక ముందే అతను సఫారీ ఫ్యాన్స్ దృష్టిలో హీరోగా మారిపోయాడు. ఆస్ట్రేలియా 'బౌలింగ్ చతుష్టయం'ను ఎదుర్కొని దక్షిణాఫ్రికా 282 పరుగులు సాధించగలదా అనే సందేహాల మధ్య అతను అసాధారణ బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'డకౌట్' అయినా రెండో ఇన్నింగ్స్‌లో ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా తన కెరీర్‌లో అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కెప్టెన్ తెంబా బవుమా విజయగాథ కూడా ఇలాంటిదే. 64 టెస్టుల కెరీర్‌లో కేవలం 4 సెంచరీలే సాధించిన అతను ప్రతీసారి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నాడు. 'బ్లాక్ ఆఫ్రికన్' కాబట్టి టీమ్‌లో చోటు దక్కిందని, రిజర్వేషన్ కారణంగానే కొనసాగుతున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తూ వచ్చాయి. తాజా ఘనతతో బవుమా నాయకుడిగా ఆకాశమంత ఎత్తున నిలిచాడు. ఫైనల్‌కు ముందు తన కెప్టెన్సీలో ఆడిన 9 టెస్టుల్లో 8 మ్యాచ్‌లు గెలిపించి ఓటమి ఎరుగని అతను...ఇప్పుడు టీమ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిచి పోట్టివాడు అయినా గట్టివాడే అని నిరూపించాడు. మార్క్‌రమ్, బవుమా 147 పరుగుల భాగస్వామ్యం ఆస్ట్రేలియా ఆట కట్టించేలా చేసింది. డ్రగ్స్ వివాదం నుంచి బయటపడిన రబాడ 9 వికెట్లతో సఫారీ విజయానికి పునాది వేయగా, రెండో ఇన్నింగ్స్‌లో ఇన్‌గిడి తన విలువ చాటాడు.

విమర్శలను అధిగమించి...

దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించినా...ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎదురుగా బలమైన ఆస్ట్రేలియాలాంటి ప్రత్యర్థి ఉండటంతో పాటు టీమ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. టాప్-7 బ్యాటర్లతో పాటు ఆల్‌రౌండర్ యాన్సెన్ మొత్తం టెస్టు పరుగులు కలిపినా... ఒక్క స్టీవ్ స్మిత్ సాధించిన పరుగులకంటే తక్కువగా ఉన్నాయి! పైగా స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, లయన్ కలిసి ఆసీస్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కొని గెలవడం దాదాపు అసాధ్యమని అనిపించింది. అన్నింటికి మించి సఫారీ టీమ్ ఫైనల్‌కు చేరిన క్రమంపై విమర్శలు ఉన్నాయి. 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రశ్రేణి టీమ్‌లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను ఒక్క టెస్టులోనూ ఎదుర్కోని టీమ్... సొంతగడ్డపై భారత్ చేతిలో 55కు ఆలౌటై చిత్తుగా ఓడింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లాంటి బలహీన ప్రత్యర్థులపై (వరుసగా 7 టెస్టులు) గెలిచి ఫైనల్ చేరిందని వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఫైనల్‌కు ముందు 'అదంతా మా చేతుల్లో లేదు. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే దానిని ఎవరూ పట్టించుకోరు' అంటూ స్పష్టంగా చెప్పిన బవుమా దానిని చేసి చూపించాడు. ఆస్ట్రేలియాను ఓడిస్తేనే వరల్డ్ చాంపియన్‌గా భావిస్తాం అనేవారికి సమాధానం ఇచ్చాడు. స్వదేశంలో టి20 లీగ్ కోసం ప్రధాన ఆటగాళ్లతో కాకుండా ద్వితీయ శ్రేణి జట్టును న్యూజిలాండ్ పంపగా 0-2తో టీమ్ చిత్తయింది. అయినా సరే చివరకు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టు అర్హత సాధించడం విశేషం.

ఆనందం దక్కింది...

అంతర్జాతీయ క్రికెట్‌లోకి 1991లో దక్షిణాఫ్రికా పునరాగమనం చేసింది. ఆ తర్వాత 1992 వరల్డ్ కప్ సెమీస్‌లో వర్షం నిబంధనతో ఓడిన జట్టు, 1996లో అన్ని లీగ్‌లు గెలిచి క్వార్టర్స్‌లో అనూహ్యంగా ఓడింది. 1998లో క్రానే, కలిస్, రోడ్స్, బౌచర్‌లతో కూడిన జట్టు తొలి చాంపియన్స్ ట్రోఫీని గెలిచి ఆనందం పంచింది. అయితే ఆ తర్వాతే జట్టు రాత పూర్తిగా మారిపోయింది. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌కు ముందు వరకు ఒక్క ఐసీసీ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. 1999 సెమీస్‌లో 'టై'తో గుండె పగలగా, సొంతగడ్డపై 2003లో మళ్లీ వర్షంతో లెక్క తప్పడంతో సెమీస్ కూడా చేరలేకపోయింది. ఆ తర్వాత మూడు సార్లు సెమీస్ వరకు చేరడంలో సఫలమైంది. స్వదేశంలో 2007 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరని జట్టు తర్వాత రెండు సార్లు సెమీస్‌లోనే ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో ఐదు సార్లు సెమీస్‌కే పరిమితమైంది. వేర్వేరు కారణాలతో వచ్చిన ఈ ఓటములతో టీమ్‌లో నైరాశ్యం నెలకొంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా బోర్డులో రాజకీయాలు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలతో జట్టు ఆటపై కూడా ప్రభావం పడింది. వరుస ఓటములతో టీమ్ వెనుకబడిపోవడంతో ఇతర టీమ్‌ల దృష్టిలో అది ద్వితీయ శ్రేణి జట్టుగా మారిపోయింది. అయితే తాజా విజయం సఫారీ టీమ్‌లో కొత్త ఉత్సాహం తీసుకురానుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విజయం వారిలో జోష్ నింపడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

బర్త్ డే స్పెషల్



'లెనిన్'లో శ్రీలీల

దక్షిణాదిలోని యంగ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు శ్రీలీల. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ పుట్టిన రోజు జూన్ 14న. ఈ సందర్భంగా తెలుగులో ఆమె నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్, మాస్ జాతర, లెనిన్' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ రిలీజ్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. అలాగే 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ-హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పై మూడు సినిమాల నుంచి శ్రీలీల బర్త్ డే స్పెషల్ పోస్టర్స్ విడుదల అయ్యాయి.

అందుకే లా చదువుతున్నాను

- హీరోయిన్ అనంతిక

''ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో స్క్రీన్‌పై సంప్రదాయంగానే ఎక్కువగా కనిపించాను.అలాగని గ్లామర్ పాత్రలు చేయనని కాదు. నేనొక ఆర్టిస్టుని. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ ఆ సీన్స్ నా పాత్రకు, సినిమాలకు ఉపయోగపడేలా ఉండాలి'' అని హీరోయిన్ అనంతికా సనీల్ కుమార్ అన్నారు. అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనంతిక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో శుద్ధి యోగ్య అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర దృష్టి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. ఓ అమ్మాయి జీవితంలో 17 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన కొన్ని సంఘటనలను '8 వసంతాలు' సినిమాగా చూపిస్తున్నాం. ఫణీంద్రగారు చెప్పిన ఈ సినిమా కథ విన్నప్పుడు నాకు, మా అమ్మకు కన్నీళ్లొచ్చాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలతో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే యాక్టింగ్ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలనుకుంటున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. చెప్పాలంటే నేను అనుకోకుండానే నటి అయ్యాను. లాక్‌డౌన్ సమయంలో పెద్దగా పని దొరకలేదు. ఆ సమయంలో అలాంటి ఆలోచనలు వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో కరాటే, మార్షల్ ఆర్ట్స్ కూడా నేను నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను 'లా' చదువుతున్నాను. భవిష్యత్తులో రాజకీయ నాయకురాలిని అవ్వాలనుకుంటున్నాను. అందుకే 'లా' చదువుతున్నాను'' అని చెప్పారు.



మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్

- హీరో తేజ సజ్జా

'చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి' తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, 'ఓ బేబీ'తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన 'జాంబిరెడ్డి'తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ 'ఫాదర్స్ డే' గురించి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...



- నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసేవాణ్ణి.
- నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, 'మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు' అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... 'వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా' అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.
- నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, 'ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను' అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా 'సరే నీ ఇష్టం' అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించేసరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.
- నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలుపెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునే వారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.
- నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.
- నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.
- నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.
- మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా 'ప్రశాంతంగా ఉండటం' అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.
- మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.
- మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ 'ఫాదర్స్ డే'కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే 'సాక్షి'కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.



విష్ణు మంచు

శివయ్యా అని మనసారా పిలువు...

''దేవుడు లేడు... గీవుడు లేడు. అది ఒట్టి రాయి' అనే డైలాగ్‌తో ప్రారంభమైంది 'కన్నప్ప' సినిమా తెలుగు ట్రైలర్. మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ఆ తిన్నడు సామాన్యుడు కాదు... అతడ్ని దాటి వాయులింగాన్ని చేరడం అసాధ్యం', 'వాయులింగం మీద దుర్మార్గుల చూపు పడింది', 'ఈ వాయులింగం రహస్యాన్ని కాపాడటానికి నా ప్రాణాలను సైతం అర్పిస్తాను', 'ఈ గూడెంలో ఏ బిడ్డకు ఆపద రానివ్వను ఇది నా ఆన. తిన్నడి ఆన', 'ఇలాండివాడు మీకు గొప్ప భక్తుడు అవుతాడని మీకు నమ్మకం ఏంటి ప్రభు', 'నీతో పాటే నేను ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను... రుద్ర', 'ఎవరు నువ్వు... ఆ పెద్దల్లోందరి కంటే నేనే పెద్దోణ్ణి', 'నన్ను మించిన శివ భక్తుడా... ఈ సృష్టిలో లేడు', 'శివయ్యా అని మనసారా పిలువు..' అనే డైలాగ్స్ 'కన్నప్ప' ట్రైలర్‌లో ఉన్నాయి.